# కోహ్లీకి ఎసరు!


**టీ20 ప్రపంచకప్‌లో చోటుపై సందిగ్ధత**



న్యూఢిల్లీ: రానున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్‌లో స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ బరిలోకి దిగుతాడా లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్‌లో జరిగే మెగాటోర్నీ కోసం ప్రకటించే జట్టులో కోహ్లీకి చోటు దక్కకపోవచ్చుని వార్తలు వెలువడుతున్నాయి. విరాట్‌ను తప్పించి యువ క్రికెటర్లకు అవకాశమివ్వాలనే ఆలోచనతో అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. దీనికి తోడు విండీస్, అమెరికాలో ఉండే స్లో పిచ్‌లు కోహ్లీ ఆటతీరుకు సరిపోవని అందుకే అతన్ని తప్పించే అవకాశాలు మెండుగా ఉన్నట్లు బోర్డు వర్గాల వినికిడి. ఆస్ట్రేలియా వేదికగా జరిగిన గత టీ20 ప్రపంచకప్‌లో పరుగుల వరద పారించిన కోహ్లీ..అఫ్గానిస్థాన్‌తో సిరీస్ వరకు పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉన్నాడు. ప్రపంచకప్‌లో రోహిత్‌శర్మ కెప్టెన్సీలో భారత్ బరిలోకి దిగుతుందని కార్యదర్శి జైషా ప్రకటించిన నేపథ్యంలో కోహ్లీకి చోటు లభిస్తుందని ఆశించారు. మెగాటోర్నీ కోసం మే 1ఆఖరి తేదీ అయినందున ఏం జరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# విదర్భ దీటుగా

**లక్ష్యం 538**
**ప్రస్తుతం 248/5**



ముంబై: రంజీ ట్రోఫీ ఫైనల్ పోరులో ముంబైకి విదర్భ దీటుగా బదులిస్తున్నది. ముంబై నిర్దేశించిన 538 పరుగుల భారీ లక్ష్యఛేదనలో విదర్భ నాలుగో రోజు ఆట ముగిసే సరికి 5 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 10/0తో రెండో ఇన్నింగ్స్‌కు విదర్భ..ముంబై బౌలర్లకు పరీక్ష పెట్టింది. కండ్ల ముందు భారీ లక్ష్యం ఉన్నా..వెనుకకు తగ్గకుండా బ్యాటింగ్ కొనసాగించింది. ఓపెనర్లు అథర్వ(32), ధృవ్ షోరె(28) మెరుగైన శుభారంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు వీరిద్దరు 64 పరుగులు జోడించారు. మిడిలార్డర్‌లో యశ్‌రాథోడ్(7) నిరాశపరిచినా..కరణ్‌నాయర్(74), కెప్టెన్ అక్షయ్ వాడ్కర్(56 నాటౌట్) క్రీజులో పాతుకుపోయారు. 220 బంతులు ఎదుర్కొన్న కరుణ్ తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లకు పరిమితమయ్యాడు. ముంబై బౌలర్ల సహనానికి వీరిద్దరు పరీక్ష పెట్టారు. అయితే ముషీర్ ఖాన్(2/38) కరణ్‌ను ఔట్ చేయడంతో ముంబై ఊపిరి పీల్చుకుంది.

# అశ్విన్ @ 1

దుబాయ్: భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ టెస్టుల్లో నంబర్‌వన్ ర్యాంక్ అందుకున్నాడు. ఐసీసీ బుధవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అశ్విన్ 870 పాయింట్లతో అగ్రస్థానాన్ని అధిష్ఠించాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చడం ద్వారా అశ్విన్ తన ర్యాంకింగ్స్‌ను మెరుగుపర్చుకున్నాడు. ఇంగ్లండ్‌తో ఐదో టెస్టులో తొమ్మిది వికెట్లు పడగొట్టిన అశ్విన్..బుమ్రా(847)ను వెనుకకు నెడుతూ నంబర్‌వన్‌లోకి దూసుకొచ్చాడు. హాజిల్‌వుడ్ (847) ప్రస్తుతం రెండో ర్యాంక్‌లో ఉన్నాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ 751 పాయింట్లతో ఐదు ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. జైస్వాల్ (740), కోహ్లీ (737) ఎనిమిది, తొమ్మిది ర్యాంక్‌ల్లో ఉన్నారు.

# ఫైనల్లో ఢిల్లీ

**గుజరాత్‌పై ఘన విజయం**
**షెఫాలీ వర్మ మెరుపులు**

**మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేస్తూ టాప్ ప్లేస్‌తో ఫైనల్లోకి అడుగుపెట్టింది. తొలుత 126 పరుగులకే గుజరాత్‌ను కట్టడిచేయడంలో సఫలమైన ఢిల్లీ.. డాషింగ్ బ్యాటర్ షెఫాలీవర్మ ధనాధన్ అర్ధసెంచరీతో అలవోక విజయాన్ని సొంతం చేసుకుంది. ఆకాశమే హద్దుగా చెలరేగిన షెఫాలీ ధాటికి 41 బంతులు మిగిలుండగానే ఢిల్లీ గెలుపుతీరాలకు చేరింది. వరుసగా రెండో సీజన్‌లో ప్లేఆఫ్స్ చేరకుండానే ఆఖరి స్థానంతో గుజరాత్ తమ పోరాటాన్ని ముగించింది.**

న్యూఢిల్లీ: డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ దుమ్మురేపింది. భారీ విజయం లక్ష్యంగా బరిలోకి దిగిన ఢిల్లీ అనుకున్న ఫలితాన్ని అందుకుంది. బుధవారం పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో ఢిల్లీ 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. దీంతో లీగ్ ఫైనల్లోకి ప్రవేశించింది. గుజరాత్ నిర్దేశించిన 127 పరుగుల లక్ష్యఛేదనలో ఢిల్లీ 13.1 ఓవర్లలో 129/3 స్కోరు చేసింది. ఓపెనర్ షెఫాలీ వర్మ(37 బంతుల్లో 71, 7ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధసెంచరీతో విజృంభించగా, జెమీమా రోడ్రిగ్స్(38 నాటౌట్) దూకుడుగా ఆడింది. తనూజ కన్వర్(2/20) రెండు వికెట్లు తీసింది. అంతకుముందు ఢిల్లీ 20 ఓవర్లలో 126/9 స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. కాప్(2/17), మిన్ను మణి(2/9), శిఖాపాండే(2/23) ధాటికి గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. భారతి ఫల్మాలీ(42) మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. షెఫాలీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**షెఫాలీ మెరుపులు:**

ఫామ్‌మీదున్న షెఫాలీ ఆది నుంచే తనదైన శైలిలో దూకుడు కనబరిచింది. శబ్నమ్ వేసిన మూడో ఓవర్లో షెఫాలీ మూడు ఫోర్లతో విరుచుకుపడింది. మరుసటి ఓవర్లోనే ల్యానింగ్ (18), క్యాప్సే (0) ఔట్ అయ్యారు. షెఫాలీకి జెమీమా రోడ్రిగ్స్ జత కలిసింది. పవర్ ప్లే ముగిసే సరికి ఢిల్లీ 2 వికెట్ల నష్టానికి 45 పరుగులు చేసింది. ఇక్కణ్నుంచి రోడ్రిగ్స్ అండగా షెఫాలీ రెచ్చిపోయింది. గార్డ్‌నర్ వేసిన ఏడో ఓవర్లో రెండు భారీ సిక్స్‌లతో విరుచుకుపడింది. ఈ క్రమంలో 28 బంతుల్లో అర్ధసెంచరీ మార్క్ అందుకుంది. తానేం తక్కువ కాదన్నట్లు రోడ్రిగ్స్ బౌండరీలతో చెలరేగడంతో లక్ష్యం అంతకంతకూ తరిగిపోయింది. మేఘనాసింగ్ వేసిన 12వ ఓవర్లోనే అయితే షెఫాలీ ఓ ఫోర్, సిక్స్ కొడితే..రోడ్రిగ్స్ రెండు ఫోర్లు అరుసుకుంది. కన్వర్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన షెఫాలీ..క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగింది. ఆ తర్వాతి బంతికే రోడ్రిగ్స్ ఫోర్‌తో గెలుపు లాంఛనాన్ని పూర్తి చేసింది.

**గుజరాత్ ఢమాల్:**

ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే కెప్టెన్ బేత్ మూనీ(0) ఔట్ కాగా, హేమలత(7), వోల్వార్డ్(7), గార్డ్‌నర్(12)స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. భారతీ, బ్రైస్(28 నాటౌట్), లిచ్‌ఫీల్డ్(21) పరుగులు చేయడంతో గుజరాత్ పరువు దక్కింది.


షెఫాలీవర్మ (71)

**సంక్షిప్త స్కోర్లు**

**గుజరాత్:** 20 ఓవర్లలో 126/9(ఫల్మాలీ 42, బ్రైస్ 28 నాటౌట్, మణి 2/9, కాప్ 2/17), **ఢిల్లీ:** 13.1 ఓవర్లలో 129/3 (షెఫాలీ 71, రోడ్రిగ్స్ 38 నాటౌట్, కన్వర్ 2/20)

# మనీశ్ రజత జోరు

- పారా షూటింగ్ ప్రపంచకప్



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారా షూటింగ్ ప్రపంచకప్‌లో భారత షూటర్ల పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. బుధవారం జరిగిన పురుషుల 10మీటర్ల ఎయిర్ పిస్టల్(ఎస్‌హెచ్1) వ్యక్తిగత విభాగంతో పాటు టీమ్ ఈవెంట్‌లో మనీశ్ నార్వల్ రెండు రజత పతకాలతో మెరిశాడు. వ్యక్తిగత కేటగిరీలో మనీశ్ 236.7 పాయింట్లతో రెండో స్థానంలో నిలువగా, చావో యంగ్ (240.3), జెంగ్డు జో (214.7) వరుసగా స్వర్ణ, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. పీ1 పురుషుల టీమ్ 10మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1) ఈవెంట్‌లో మనీశ్ నార్వల్, రుద్రాంశ్ ఖండేల్‌వాళ్, సంజీవ్ గిరితో కూడిన భారత త్రయం రజతం ఖాతాలో వేసుకుంది. మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ (ఎస్‌హెచ్1) ఈవెంట్‌లో రుబినా ఫ్రాన్సిస్ 211.2 పాయింట్లతో కాంస్యం సొంతం చేసుకుంది.

# భారత్ ఘన విజయం

న్యూఢిల్లీ: భారత అంధుల క్రికెట్ జట్టు అదరగొడుతున్నది. శ్రీలంకతో బుధవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 3–0 ఆధిక్యంలోకి వెళ్లింది. లంక నిర్దేశించిన 163 పరుగుల లక్ష్యఛేదనలో భారత్ మూడు వికెట్లు కోల్పోయి మరో 27 బంతులు మిగిలుండగానే విజయాన్నందుకుంది. పంకజ్, దినేశ్ జట్టు విజయంలో కీలకమయ్యారు. లంక తరఫున చందన దేశ్‌ప్రియ(76) ఫర్వాలేదనిపించాడు.



# ఆర్చర్ చికితకు జగన్ అండ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రానికి చెందిన యువ ఆర్చర్ తానిపర్తి చికితారావుకు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు అండగా నిలిచారు. బుధవారం హైదరాబాద్‌లో తన తండ్రి శ్రీనివాసరావుతో జగన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో తాను సాధించిన పతకాలు, విజయాల గురించి చికిత వివరించింది. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన చికితారావు ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చింది. సమస్యలు విన్న జగన్..అన్ని రకాలుగా అండగా ఉంటానని చికితకు భరోసా అందించారు.

# ప్రిక్వార్టర్స్‌లో లక్ష్యసేన్

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత యువ షట్లర్ లక్ష్యసేన్ ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. బుధవారం పురుషుల సింగిల్స్ తొలిరౌండ్‌లో లక్ష్యసేన్ 21–14, 21–14తో మాగ్నస్ జోహాన్సన్(డెన్మార్క్)పై అలవోక విజయం సాధించాడు. 40నిమిషాల్లో ముగిసిన పోరులో లక్ష్యసేన్ తనదైన ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆది నుంచి దూకుడు కనబరిచిన లక్ష్యసేన్..వరుస గేముల్లో ప్రత్యర్థిని మట్టికరిపించాడు.



## ఫ్రీ బస్సులో రద్దీ.. సొమ్మసిల్లిన కండక్టర్

రామాయంపేట, మార్చి 13: ఉచిత బస్సు ప్రయాణంతో పరిమితికి మించి ప్రయాణికులు బస్సులో ఎక్కడంతో కండక్టర్ స్పృహ తప్పిపడిపోయింది. ఈ ఘటన బుధవారం మెదక్ జిల్లాలో చోటుచేసుకుంది. మెదక్ డిపోకు చెందిన బస్సు రామాయంపేట నుంచి బయలుదేరింది. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో కండక్టర్ అనిత టికెట్ ఇస్తుండగా ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఛాతీలో నొప్పి వస్తుందంటూ డ్రైవర్‌కు చెప్పడంతో కంట్రోలర్ బాబుసింగ్‌కు సమాచారం ఇచ్చారు. ప్రయాణికులను దించేసి, అదే బస్సులో కండక్టర్‌ను రామాయంపేటలోని ప్రభుత్వ దవాఖానకు వైద్యం కోసం తీసుకెళ్లారు.

# కిడ్నీ మార్పిడితో 'స్టార్' జీవితం

- పునర్జన్మను ప్రసాదిస్తున్న వైద్యులు
- ఘనంగా స్టార్ సెలబ్రిటీ ప్రదానోత్సవం
- నేడు ప్రపంచ కిడ్నీ దినోత్సవం

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ) 'కిడ్నీలు పాడయ్యాయి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం' ఇలాంటి పిడుగులాంటి వార్త అప్పటివరకు సాఫీగా సాగుతున్న జీవితంలో వారి పరుగును ఆపేస్తుంది. కుటుంబంలో సంతోషాన్ని కాలరాస్తుంది. ఎన్నో లక్ష్యాలు.. మరెన్నో బాధ్యతలు.. జీవితమే ఆగిపోతుందని తెలిశాక ఆ క్షణాలను దాటడం నరకం. కిడ్నీలు ఫెయిలై జీవితమే ముగుస్తుందనుకున్న చాలామంది జీవితాల్లో 'కిడ్నీ మార్పిడి' చికిత్సలు వెలుగులు నింపుతున్నాయి. వైద్యులు ప్రసాదించే పునర్జన్మతో ఎంతోమంది జీవితంలో గొప్ప లక్ష్యాలను ఛేదిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నానక్‌రాంగూడలోని స్టార్ దవాఖానలో కిడ్నీ వారియర్స్‌కు 'స్టార్ సెలబ్రిటీ' అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఇందులో అవార్డుల గ్రహీతలు పునర్జన్మ ప్రసాదించిన వైద్యుల సేవలను తలచుకుని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్టార్ హాస్పిటల్ నెఫ్రాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ డైరెక్టర్ డాక్టర్ జీ శ్రీధర్, డాక్టర్ జ్యోత్స్న, డాక్టర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.


నానక్‌రాంగూడలోని స్టార్ దవాఖానలో కిడ్నీ వారియర్స్‌కు అవార్డుల ప్రదానోత్సవం

## 90 శాతం మందిలో లక్షణాలు ఉండటం లేదు

కిడ్నీ మార్పిడి చేసుకున్న వారి విజయగాథను అందరికి తెలియజేయాలనే ఉద్దేశంతోనే ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్నీ వారియర్స్‌ను స్టార్ సెలబ్రిటీ అవార్డులతో సత్కరించాం. చాలా మంది 90 శాతం కిడ్నీ ఫెయిల్ అయ్యాక దవాఖానకు వస్తున్నారు. స్టేజ్1, 2లో ఉన్నప్పుడు ఎలాంటి డయాలసిస్, మార్పిడి చేయాల్సిన పనిలేకుండా క్యూర్ చేయొచ్చు. **- డాక్టర్ జీ శ్రీధర్, ఎండీ, డీఎం(నెఫ్రాలజీ),ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్, స్టార్ దవాఖాన**

## కేంద్రసాహిత్య అవార్డు చూడగలిగా



2013లో పంచాయతీ ఎలక్షన్స్ డ్యూటీలో ఉండగా, కాలి మడిమ దగ్గర వాపు వచ్చింది. సీరం క్రియాటినైన్ లెవల్ పెరిగిందని వైద్యులు చెప్పారు. డాక్టర్ శ్రీధర్‌ను కలిసి, కిడ్నీ ఫెయిల్ అయిందని తెలుసుకున్నా. నా భార్య కిడ్నీ ఇవ్వడంతో 2014లో ఆపరేషన్ జరిగింది. పునర్జన్మ ప్రసాదించిన డాక్టర్ శ్రీధర్‌కు నేను రాసిన మానేరు గలగల పుస్తకాన్ని అంకితమిచ్చా. ఉర్దు కవి గుల్జార్ 'గ్రీన్ ' పుస్తకాన్ని ఆకుపచ్చ కవితలు పేరుతో అనువాదం చేశాను. దీనికి నాకు 2022లో కేంద్ర సాహిత్య అవార్డు వచ్చింది.

**-వారాల ఆనంద్**
**కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత**

## మద్యం వాహనం బోల్తా



*జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారాం వద్ద కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి పక్కన మద్యం వాహనం బుధవారం బోల్తా పడింది. కరీంనగర్ మద్యం డిపో నుంచి రూ.50 లక్షల విలువైన మద్యంతో ఏపీ15 పీసీ7575 నంబర్ గల వాహనం కోరుట్ల వైపు వెళ్తున్నది. ఈ క్రమంలో రాజారాం వద్ద వీఆర్‌కే కాలేజ్ సమీపంలోకి చేరుకోగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌కు ప్రమాదం తప్పింది. 50 శాతం మేర మద్యం బాటిళ్లు ధ్వంసమయ్యాయని, కేసు దర్యాప్తులో ఉందని ఎస్సై కుమారస్వామి తెలిపారు.* **-మల్యాల(కొడిమ్యాల)**




VENKATARAMANA MOTORS: Gachibowli: 7506025311, Ecil, Kushaiguda: 7506025339, Vanasthalipuram: 7506025358, Jubilee Hills: 8878334320, Kukatpally: 8879221046, Vikarabad, Tandur: 8879208240.
MALIK CARS: Malakpet: 7506025166, Himayathnagar: 7506025158, Bowenpally: 7506025486.
PRATHAMMALIK AUTOMATRIX: Banjara Hills: 8291058022, Boduppal: 9000979494, Financial District (Near Q City): 9167090503.
TEJASWI AUTOMOBILES: HiTech City, Madhapur, Sangareddy, Siddipet, Zaheerabad: 7506025271, Tolichowki: 8879186915.
JASPER INDUSTRIES: SD Road, Secunderabad: 9619024718, Nacharam: 8879152707, Chandrayangutta: 9167450755, Kompally: 9619973314.
SELECT CARS: Nagole: 7506025176, Chandanagar: 7506025180, Begumpet: 7506025220, Bachupally: 9167413840, Karmanghat: 9619053048.
ORANGE AUTO: Attapur: 9167473372, Erragadda: 7506025174, Kharkana: 8291244717, Medchal, Medak: 7506025493.
Service: Kondapur, ECIL, Tolichowki, Bowenpally, Hi-tech City, Sangareddy, Zaheerabad, Siddipet, Sanathnagar, Uppal, Kompally, Tadbund, Secunderabad, Hafeezpet.
Terms and Conditions apply. *Benefits up to differs from model to model and is inclusive of consumer offer, exchange bonus and maximum corporate offer. All offers are valid for limited period or till stocks last. *Warranty cover for 3 years/ 1 Lakh km, whichever ends earlier. Images and illustrations are indicative and for information purposes only. All features/specifications are not available in all variants and may vary for different variants. Specifications/features are subject to change without prior information. Colours may vary due to printing limitations. Local taxes and octroi extra.


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.